## నేడు 'బీఆర్ఎస్ సభ' సన్నాహక సమావేశం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్6: ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహా సభకు సంబంధించి సన్నాహక సభను ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సన్నాహక సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పొతంగల్, ఏప్రిల్ 6 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మండలంలోని సుంకిని నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టరను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా.. ఎస్సై సందీప్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వెదురు బొంగులు, తడకల షాపులో అగ్నిప్రమాదం



షాపులో నుంచి చెలరేగుతున్న మంటలు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 6 : జిల్లా కేంద్రంలోని వర్ని చౌరస్తాలో ఉన్న డెకరేషన్, వెదురు బొంగులు, తడకల షాపులో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్, రెండో టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు చుట్టు పక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో వస్తువులన్నీ కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు షాపు నిర్వాహకులు బోరున విలపించారు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు ఫిర్యాదు తీసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మోర్తాడ్, ఏప్రిల్ 6: భీమ్‌గల్ మండలం జాగిర్యాల్ గ్రామంలోని క్రాసింగ్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోర్తాడ్‌కు చెందిన గండికోట మహేశ్(42) మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహేశ్ భీమ్‌గల్ నుంచి మోర్తాడ్‌కు వస్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా 108లో దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి సోదరుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, ఏప్రిల్ 6: బోధన్ పట్టణంలోని ఇందూర్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు నవోదయ ప్రవేశపరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించి ఆ పాఠశాల 9వ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి నవోదయ పాఠశాలలో 9వ తరగతిలో ప్రవేశానికి 17 సీట్లు ఉండగా, ఇందూర్ హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు జె.వంశీక, వై.అరుచి, రిస్విత, అస్మిత, సాత్విక్ ఎంపిక్యారు. వారిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం రాత్రి అభినందించారు. కార్యక్రమంలో ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిశోర్ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



చలి వేంద్రం ప్రారంభిస్తున్న ఎస్సై రజనీకాంత్

ముప్కాల్ ఏప్రిల్ 6: మండలంలోని నల్లూర్ గ్రామంలో చలి వేంద్రాన్ని ఎస్సై రజనీకాంత్ ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన జంగం పోశెట్టి కుమార్తె మమత జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జంగం గోపి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నారాయణ, రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు బోధన్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

బోధన్, ఏప్రిల్ 6: పట్టణ శివారులో ఘన్‌పూర్ క్రాస్‌రోడ్డులో కమ్మ సంఘం భవనం ప్రారంభోత్సవం, ఆ భవనం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మాజీ సీఎం దివంగత ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమాలు సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శి హరినాథ్‌బాబు, కోశాధికారి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కమ్మ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, తెలంగాణ కమ్మ సేవా సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ మాజీ చైర్మన్ అమర్‌నాథ్‌బాబు, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ అట్లూరి రమాదేవి హాజరవుతారని పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రామనవమి వేడుకలు

- వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణం
- తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయాలు



ఖిల్లా రామాలయంలో ఉత్సవమూర్తులు



ఇందల్వాయిలో సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో హాజరైన గ్రామస్తులు



రుద్రూర్ మండలం లక్ష్మీపూర్ క్యాంప్‌లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 6 : జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆదివారం శ్రీ రామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాల్లో, వాడవాడలా చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల్లో యువకులు డీజే చప్పుళ్ల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఖిల్లారఘునాథ ఆలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఖిల్లా డిచ్‌పల్లి ఆలయంలో, మాధవనగర్ సాయిబాబా ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు హాజరై పూజలు చేశారు.

**వేడుకల్లో పాల్గొన్న బాల్కొండ ఎమ్మెల్యే**

పోచంపాడ్‌లోని శ్రీకోదండరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతిసమేతంగా హాజరయ్యారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నదాన సత్రంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసేపు భక్తులకు వడ్డన చేశారు. వేల్పూర్ మండల కేంద్రంలోని రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీసమేతం పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గ్రామకమిటీ సభ్యులు, గ్రామస్తులు సన్మానించారు. వేల్పూర్ మండలంలోని పడిగెల్ గ్రామంలో శ్రీరామనవమి వేడుకల ఘనంగా నిర్వహించారు. వేయి కలశాల గంగాజలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సీతారాముల ప్రతిమలతో రథోత్సవం నిర్వహించారు. భీమ్‌గల్ మండలం పిప్రి శివారు అటవీ ప్రాంతంలో ఉన్న లొద్ది రామన్న ఆలయంలో నిర్వహించిన సీతారామ కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శక్కర్‌నగర్ శ్రీరామ మందిరంలో..



సుభాష్‌నగర్ రామాలయం వద్ద భక్తుల క్యూ

**రామాలయానికి సీఎంను తీసుకువస్తా..**

చారిత్రాత్మక డిచ్‌పల్లి ఖిల్లా రామాలయానికి సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకువస్తానని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. డిచ్‌పల్లి రామాలయాన్ని టూరిజం హబ్‌గా మార్చాలని శాసనసభలో మాట్లాడినట్లు తెలిపారు. ఏకో టూరిజంలో భాగంగా డిచ్‌పల్లి రామాలయం వద్ద పార్క్ ఏర్పాటు పక్కన చెరువులో బోటింగ్, గుట్టపై వరకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.



పడిగెల్‌లో రథం వద్ద విగ్రహాలకు గంగాజలంతో అభిషేకం చేస్తున్న గ్రామస్తులు

## ఆన్‌లైన్ మోసం.. కేసు నమోదు

నవీపేట, ఏప్రిల్ 6: వారం క్రితం సైబర్ మోసగాళ్ల చేతిలో ఓ బాధితుడు రూ.70వేలు పోగొట్టుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని సుభాస్‌నగర్‌కు చెందిన సైబా వెంకటేశ్వర్ పది నెలలుగా మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల ఒకటిన గుర్తు తెలియని వ్యక్తి తన వాహనంలో రూ.3,370 డీజిల్ కొట్టించుకొని ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించాడు. అదే రోజు తాను ఈ డబ్బులను బంక్ యాజమానికి ఫోన్‌పే ద్వారా పంపించేందుకు ప్రయత్నించాడు. ఫోన్‌పే నుంచి డబ్బులు బదిలీ కాలేదు. వెంటనే సదరు బాధితుడు ఎస్‌బీఐ కస్టమర్ కేర్ కు ఫోన్ చేశాడు. కస్టమర్ కేర్‌కు చెందిన వ్యక్తి తాను చెప్పినట్లు చేస్తే డబ్బులు వస్తాయని చెప్పాడు. ఆయన చెప్పినట్లు చేయగానే క్రమంగా రూ.రెండువేలు, రూ.20వేలు, రూ.48వేలు వెంకటేశ్వర్ బ్యాంకు ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. వెంటనే ఆదే నంబర్‌కు ఫోన్ చేయగా అవతలి వ్యక్తి స్పందించక పోదు. దీంతో సైబర్ నేరాగాళ్ల చేతిలో మోస పోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే వేములకు సన్మానం

వేల్పూర్, ఏప్రిల్ 6: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని వేల్పూర్‌లో గ్రామస్తులు సన్మానించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే పనితీరుపై ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో వేముల ప్రశాంత్ రెడ్డి 5వ స్థానం సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రెడ్ యూత్ సభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు, వివిధ కులసంఘాల సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

## హీమోఫీలియోపై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 6 : జిల్లాకేంద్రంలోని స్నేహ సొసైటీలో హీమోఫీలియో వ్యాధిపై బాధితులకు, వారి తల్లిదండ్రులకు హీమోఫిలియో సొసైటీ – నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిల్లల వైద్యనిపుణుడు నీలి రాంచందర్ హాజరై అవగాహన కల్పించారు. హీమోఫీలియో వ్యాధిగ్రస్తులకు రక్తం త్వరగా గడ్డకట్టదని, ఒక్కో సారి అసలే రక్తం గడ్డకట్టదని తెలిపారు. ఇది పుట్టుకతో జన్యులోపంతో వచ్చే వ్యాధి అని తెలిపారు. దీనికి స్క్రీనింగ్, కౌన్సెలింగ్ అవసరమని తెలిపారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కో బాధితుడికి రూ. 10 వేల విలువ చేసే ప్యాక్‌లను అందజేశారు. అనంతరం విజయానంద రావు రాసిన కరపత్రాలను విడుదల చేశారు.

## చలివేంద్రం ప్రారంభం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 6 : జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్ద మార్వాడీ యువ మంచ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ ఆనంద్, సిబ్బంది, సంస్థ సభ్యులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్పల్లి, ఏప్రిల్ 6 : మండలంలోని దుబ్బాక, గుడితండా, గోవింద్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, మహిళా సంఘాల నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, పోతరాజు, అశోక్, గున్నారెడ్డి, వినోద్, ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.

## సైరన్లు బిగిస్తే కేసులు నమోదు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 6 : వాహనాలకు అనుమతులు లేకుండా సైరన్ బిగించి, ట్రాఫిక్‌లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు వాహనదారులు అనుమతులు లేకుండా వాహనాలకు సైరన్లు బిగించి, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అక్రమంగా సైరన్లు బిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## దాతల సహకారంతో బారికేడ్ల ఏర్పాటు

మోస్రా (చందూర్), ఏప్రిల్ 6 : మోస్రా మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లను దాతల సహకారంతో ఆదివారం ఏర్పాటు చేశారు. వీడీసీ చైర్మన్ బిల్లా పోతన్న మాట్లాడుతూ.. మోస్రాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చందూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీ సాయి విద్యాలయ అధినేత ఉప్పల మధు సహకారంతో నాలుగు బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ బిల్లా పోతన్న, సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## కళావిహీనంగా పల్లె ప్రకృతివనం



పల్లెప్రకృతివనంలో పూర్తిగా ఎండిన మొక్కలు



విరిగిపోయిన పల్లెప్రకృతి వనం గేటు

సారంగాపూర్, మార్చి 22 : గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో పల్లె వనాలను ఏర్పాటు చేసి మొక్కలు నాటి సంరక్షించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాల అభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. రూరల్ మండలంలోని మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయం పక్కన డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ గ్రామపంచాయతీ తరపున ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం స్పెషల్ ఆఫీసర్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై కళావిహీనంగా మారింది. గతేడాది వరకు కొనసాగిన సర్పంచుల పదవీ కాలంలో పల్లెప్రకృతి వనం పచ్చగా కళకళలాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం అందించింది. అనంతరం స్పెషల్ ఆఫీసర్ల పాలన అందుబాటులోకి రావడంతో సాయిబాబా ఆలయం పక్కన ఉన్న పల్లెప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. పల్లెప్రకృతి వనం ఆనవాళ్లు కోల్పోయి కళావిహీనంగా మారింది. సాయిబాబా ఆలయానికి వచ్చిన భక్తులు పల్లెప్రకృతి వనంలో సేద తీరుతారన్న ఉద్దేశంతో నాలుగేండ్ల క్రితం బర్ధిపూర్ సర్పంచ్ సృజన ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు, ఈజీఎస్ సిబ్బంది పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ప్రకృతివనం చుట్టూ ఫెన్సింగ్, బోర్డు, గేటు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మొక్కలు ఎండిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రస్తుతం బోర్డు, గేట్లు విరిగి ఒక పక్కన పడి ఉన్నాయి. అధికారులు స్పందించి కళాహీనంగా మారిన పల్లెప్రకృతివనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## బోనస్ కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- అధికారులు చర్యలు తీసుకోకపోతే చలో కలెక్టరేట్‌కు సిద్ధం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు యలమంచిలి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న యలమంచిలి శ్రీనివాసరావు

కోటగిరి, ఏప్రిల్ 6 : కోటగిరి వ్యవసాయ సహకార సంఘంలో రైతుల ముసుగులో బోనస్ కాజేసిన వారిపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, ఇందులో కీలకపాత్ర పోషించిన నాలుగు రైస్‌మిల్లులకు ధాన్యం అలాట్‌మెంట్ ఇవ్వొద్దని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు యలమంచిలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో కాంగ్రెస్, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరులు బోనస్ విషయంలో అవినీతికి పాల్పడితే, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదన్నారు. పార్టీలో ఎవరు తప్పు చేసినా అధిష్టానం సహించదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా అధికార పార్టీ తప్పు చేస్తే ప్రతిపక్ష పాత్ర కూడా పోషించాల్సి వస్తుందని అన్నారు. ఎమ్మెల్యే రైతుపక్షపాతి అయితే రైతుల బోనస్ కాజేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, వారికి ఎందుకు అండగా ఉంటున్నారని ప్రశ్నించారు. బోనస్ కాజేసిన వారిపై సమగ్ర విచారణ చేపట్టాలని, క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, రైస్‌మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు బోనస్ విషయంలో స్పందించకుంటే రైతులతో కలిసి కలెక్టరేట్‌కు తరలివెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులుడు గంగాధర్‌దేశాయ్, సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సలీం, తరుణ్, వహీద్, నజీర్, కూచి సాయిబాబా, పాకాల సాయిలు, సోహెల్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటివద్ద పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 6: బోధన్ పట్టణం వేంకటేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన ఈశ్వర్‌దాస్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి హైదరాబాద్‌లోని తన కుమారుడి వద్దకు ఇంటికి తాళం వేసి ఈనెల4న వెళ్లారు. కాగా, ఆదివారం ఈశ్వర్‌దాస్ ఇంటి తలుపులు తెరిచి ఉండడం చూసిన ఇంటిపక్కనే ఉంటున్న అరుణ్‌కుమార్ అనే వ్యక్తి యజమానికి ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. సమాచారం అందిన వెంటనే బోధన్‌కు వచ్చిన ఈశ్వర్‌దాస్ తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఇంటిని పరిశీలించారు. తాళాలు పగులగొట్టిన దుండగులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. బీరువాను పగులగొట్టి అందులోని కిలో వెండి ఆభరణాలు, తులం బంగారు ఆభరణాలతోపాటు రూ.30వేల నగదు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

## రసవత్తరంగా కుస్తీపోటీలు

కోటగిరి/ మోస్రా (చందూర్)/రెంజల్, ఏప్రిల్ 6 : కోటగిరి మండలకేంద్రంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా కోటగిరి మీదిగల్లీ నాయకుల ఆధ్వర్యంలో కుస్తీపోటీలను ఆదివారం నిర్వహించారు. కోటగిరితోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు, మహారాష్ట్ర నుంచి మల్లయోధులు కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతి అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తెల్ల రవికుమార్, మామిడి కిషన్, మనోహర్, మారుతీ పటేల్, విఠల్ తదితరులు పాల్గొన్నారు. మోస్రా మండలంలోని గోవూర్ గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మల్లయోధులకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రెంజల్ మండలంలో కందకుర్తి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. చివరి కుస్తీ పోటీల్లో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన రాజు పటేల్ గెలుపొంది 10 తులాల వెండి నాణెం గెలుచుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన మరో మల్లయోధుడు ద్వితీయ బహుమతిగా 5 తులాల వెండిని సాధించాడు. మల్లయోధులకు గ్రామపెద్దలు బహుమతులు అందజేశారు.



కందకుర్తిలో గెలుపొందిన మల్ల యోధుడికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు



కోటగిరిలో కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

## బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 1.40 కోట్లు మంజూరు
- పనులు చేపట్టడంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం



కంకర వేసి వదిలేసిన అబ్బాపూర్(బీ) రోడ్డు

నవీపేట, ఏప్రిల్ 6: మండలంలో మారు మూల గ్రామమైన అబ్బాపూర్(బీ) బీటీ రోడ్డుకు నోచుకోవడం లేదు. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మండలంలోని అన్ని గ్రామాలకు కేసీఆర్ ప్రభుత్వం బీటీ రోడ్లు వేయించింది. అబ్బాపూర్(బీ) గ్రామం నుంచి బినోలా రోడ్డును కలుపుతూ 1.8 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో గిరిజన సంక్షేమ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. రోడ్డుపై కంకర వేసి బీటీ వేయకుండా వదిలేశారు. అబ్బాపూర్(బీ) గ్రామానికి నవీపేట నుంచి మట్టయ్యఫారం అబ్బాపూర్(బీ) గ్రామం వరకు ఒక పక్కన బీఆర్ఎస్ హయాంలో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. బినోలా నుంచి అబ్బాపూర్(బి) వరకు కూడా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బీటీ రోడ్డు పనులు పూర్తి చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కంకర రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మా గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైంది. సత్వరమే రోడ్డు పనులు ప్రారంభం కావడంతో సంతోష పడ్డాం. కానీ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఏడాది నుంచి కంకర రోడ్డుపై బినోలా, జన్నేపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వాహనాలు తరుచూ అదుపు తప్పుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరగా పనులు చేపట్టి మా కష్టాలు దూరం చేయాలి.

– ఈర్నాల స్వామి, మాజీ ఉప సర్పంచ్, అబ్బాపూర్(బీ)

### రీ టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం..

గత ప్రభుత్వ హయాంలో 2023–24 సంవత్సరానికి గాను అబ్బాపూర్(బీ) గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.40 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 1.8 కిలో మీటర్ల పొడవు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ శంకర్ గతేడాది మృతి చెందాడు. చేసిన పనులకు బిల్ చేసి క్లోజ్ చేశాం. మిగిలిన బీటీ రోడ్డుకు రీ టెండర్లు పిలిచేందుకు ప్రణాళికను సిద్ధం చేశాం. త్వరలో రీ టెండర్లను పిలిచి పనులను ప్రారంభిస్తాం.

– సంపత్, డిప్యూటీ ఈఈ, గిరిజన సంక్షేమ శాఖ హైదరాబాద్